క్లుప్తంగా

కల్యాణ వేంకటేశ్వరునికి స్నపన తిరుమంజనం


అభిషేకాలు అందుకుంటున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

వేపాడ: మండల కేంద్రమైన వేపాడలో వైశాఖమాసాన్ని పురస్కరించుకుని శ్రీదేవీ భూదేవీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవిప్రసాద్ మంత్రోచ్ఛరణలతో మూలవిరాట్లకు పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యఅభిషేకం, నక్షత్రహారతి, పట్టువస్త్రాలంకరణ, దీప, కర్పూర హారతితో అష్టోత్తర శతనామాలతో పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు

జామి: మండల కేంద్రమైన జామి మాధవరాయిమెట్ట కాలనీలో ఉన్న రామలయం ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్, స్థానికుల ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కోలాట ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సమరసత సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ ఎం.భవానీ ప్రసాద్, గౌరవ కన్వీనర్ బి.అప్పలరాజు, మండల సంయోజక్ మట్టా జనార్దనరావు, సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

232 మందికి వైద్య సేవలు


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అజిత్‌బాబు

మెరకముడిదాం: మండలంలోని భీమవరం గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మెరకముడిదాం పీహెచ్‌సీ వైద్యాధికారి కె.అజిత్‌బాబు ఆధ్వర్యంలో వైద్యులు సీత, సూర్యతేజవర్మ, సిబ్బంది రోగులకు వైద్య సేవలందించారు. ఈ శిబిరంలో సుమారు 232 మందికి వైద్య సేవలు అందించినట్లు వైద్యాధికారి తెలిపారు. ముగ్గురు రోగులను మెరుగైన చికిత్స కోసం విజయనగరం కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేసినట్లు చెప్పారు. మిగిలిన వారికి రక్త పరీక్షలతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా అందించారు. పీహెచ్‌సీ సిబ్బంది రామారావు, అసిరినాయుడు, వర్మ, ఎస్‌ఎంఎలు, ఆశావర్కర్లు శిబిరంలో సేవలందించారు.

రైల్వే స్టేషన్ వద్ద ప్రత్యేక నిఘా..

గజపతినగరం: మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తులు చైన్‌లు లాగి రైళ్లను ఆపుతున్నట్లు తమకు సమాచారం రావడంతో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే పోలీసులు ఈశ్వరరావు, కృష్ణ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం గజపతినగరం- పురిటిపెంట రైల్వే లైన్ వద్ద చైన్ లాగడంతో టాటానగర్ ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ రైలు కొంత సమయం నిలిచి పోయిందని స్థానికులు, ప్రయాణికులు సమాచారం ఇచ్చారన్నారు. ఇలా ఎవరు చేస్తున్నారన్నదీ తెలుసుకునేందుకు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామన్నారు.

మరింత రుచిగా మధ్యాహ్న భోజనం


వివిధ రకాల వంటలను ప్రదర్శిస్తున్న నిర్వాహకులు

వేపాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. విజయవాడలో మూడురోజుల పాటు శిక్షణ పొందిన సీసీహెచ్ మాస్టర్ ట్రైనర్ జి.లక్ష్మి మధ్యాహ్న భోజన పథకంలో మెనూ అమలు, నాణ్యత, రుచి తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. అలాగే వివిధ రకాల వంటకాలను ప్రదర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టడమే ఈ శిక్షణ ఉద్దేశమని ఎంఈఓలు జి.జగదీశ్వరరావు, పి.బాలభాస్కరరావు అన్నారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. కార్యక్రమంలో మండలంలో పనిచేస్తున్న సీసీహెచ్ సభ్యులు 58, ఎమ్మార్సీ సిబ్బంది, సీఆర్‌ఎంటీఎస్, ఐఈఆర్టీలు పాల్గొన్నారు.

'సేంద్రియం' లాభదాయకం

- సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం, పంట దిగుబడులు వృద్ధి
- పొలాలకు పశువుల పేడ, చెరువు మట్టి తరలిస్తున్న రైతులు
- పచ్చిరొట్ట పంటల సాగుపై ఆసక్తి


సేంద్రియ ఎరువులతో ఏపుగా పెరిగిన నువ్వు పంట


పశువుల పేడతో రైతులు తయారు చేసుకున్న సేంద్రియ ఎరువు

లక్కవరపుకోట: రసాయన ఎరువుల వినియోగంతో భూసారం తగ్గి నష్టపోతున్న రైతన్నలు సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో పశువులు, మేకలు, గొర్రెలు, కోళ్ల వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా వినియోగించేందుకు ఆసక్తి చూపుతున్నారు. పశువుల పేడ, గడ్డి, ఇతర వ్యర్థాలను కుళ్లబెట్టడం ద్వారా సేంద్రియ ఎరువు(గత్తం)ను తయారు చేస్తారు. దాన్ని పొలంలో చల్లుకోవడం ద్వారా అందులోని కర్బన సంబంధిత సూక్ష్మ, స్థూల పోషకాలు నేలను చేరి నేల సారవంతం అవుతుంది. పంటకు కావాల్సిన పోషకాలన్నీ అందడంతో రసాయన ఎరువుల కోసం రైతులు అదనంగా ఖర్చు చేయాల్సిన అవసరం ఉండదు. పంటలను ఆశించే చీడపీడల నివారణకు కూడా రసాయన మందులకు బదులు వేపాకు, కామునిక్కలతో చేసిన కషాయాలను వినియోగించడం ద్వారా పురుగు మందుల కొనుగోలు ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన పంట దిగుబడులను పొందవచ్చని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువుల వినియోగం, ప్రకృతి సాగు విధానంపై వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



ఏటా పశువుల వ్యర్థాల(గత్తం)ను పంటకు ఎరువుగా వినియోగిస్తున్నాం. మంచి దిగుబడులు సాధిస్తున్నాం. రసాయన ఎరువుల జోలికిపోవడం లేదు. సేంద్రియ ఎరువుల వినియోగంతో భూసారం పెరగడంతో పాటు దిగుబడి కూడా బాగుటుంది.

– గుల్లిపల్లి అప్పలరాజు, రైతు, శ్రీరాంపురం,లక్కవరపుకోట మండలం

పశువుల పెంటనే వాడుతున్నాం



పంట పొలాలకు పశువుల ఎరువునే వాడుతున్నాం. అలాగే చెరువుల్లో ఉండే వండ్రు మట్టిని మెరక ప్రాంతాల్లో పండించే వేరుశనగ, కర్రపెండలం పంటలకు వేశాం. సేంద్రియ ఎరువులతో మంచిగా దిగుబడులు వస్తున్నాయి.

– గండి పైడిరాజు, లింగంపేట గ్రామం, లక్కవరపుకోట మండలం

అవగాహన కల్పిస్తున్నాం

సేంద్రియ ఎరువుల వాడకం ప్రయోజనాలు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై రైతుల నుంచి కూడా మంచి స్పందన లభిస్తున్నది. గత మూడు సంవత్సరాలుగా ఎక్కువ శాతం రసాయన ఎరువులు వాడకం తగ్గింది.

– కె.సరస్వతి, సబల స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, కొత్తవలస మండలం

పంటల నిల్వకు ప్రత్యేక గోదాం


రామలింగాపురం వద్ద రూ.40 లక్షలతో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాం

- రూ.40 లక్షలతో నిర్మాణం
- 500 మెట్రిక్ టన్నుల వరకు నిల్వ

చీపురుపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చింది. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్ర పరికరాలను ఆర్‌బీకేల ద్వారా రాయితీపై అందిస్తోంది. రైతులు పండించిన పంటలను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తోంది. పంటలకు మార్కెట్లో గిట్టుబాటు ధర లేకపోతే వాటిని నిల్వ చేసుకునేందుకు గోదాంలు, కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మండలంలోని రామలింగాపురం గ్రామంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాంను ప్రభుత్వం నిర్మించింది. గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పీఏసీఎస్) ఆధ్వర్యంలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో దీన్ని నిర్మించారు. రామలింగాపురం పీఏసీఎస్ పరిధిలోని రైతులకు ఈ గోదాం ఎంతో ప్రయోజనకంగా ఉంటుందని అధికారులు చెబుతున్నారు. రైతులు పండించిన పంటలకు మార్కెట్‌లో గిట్టుబాటు ధర లభించే వరకు ఈ గోదాంలో పంటలను నిల్వ చేసుకోవచ్చు. అంతేకాకుండా వర్షాలకు పంట తడిచిపోకుండా తాత్కాలికంగా ఈ బహుళ ప్రయోజన సౌకర్య గోదాంలో నిల్వ చేసుకునే సదు పాయం కూడా ఉంది. రైతులకు ఎన్నో ప్రయోజనాలు చేకూర్చే ఈ గోదాంను ప్రభుత్వం కొద్ది నెలలు కిందటే అందుబాటులోకి తీసుకొచ్చింది.

నేడు హనుమాన్ జయంతి వేడుకలు

బొండపల్లి: మండలంలోని ఎం.కొత్తవలస గ్రామంలోని కొత్త కాలనీతో పాటు, కోవ్వాడపేట, దేవుపల్లిలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకల నిర్వహిణకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు భారీ అన్నసమారాధన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవుపల్లి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో సీతారామ కల్యాణం వైభవంగా చేపట్టనున్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామం సమీపంలో ఉన్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 6,7,8,9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి జూన్ 20న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ యు.విజయ్‌కుమార్ పాత్రో శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో తరగతిలో ఒక్కో సీటు చొప్పున ఖాళీగా ఉన్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు జూన్ 5 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 20న జిల్లా కేంద్రంలో ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ధూమపానానికి దూరంగా ఉందాం..


కొత్తవలస: వియ్యంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది


గజపతినగరం: ర్యాలీలో పాల్గొన్న సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, తదితరులు

కొత్తవలస: పొగాకు, పొగాకు ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని, ప్రతి ఒక్కరూ వాటికి దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సింహాద్రినాయుడు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని ముసిరావ, తుమ్మికాపల్లి, రామలింగాపురం, తదితర గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. నో స్మోక్–నో పాయిజన్, సేవ్ లంగ్స్–సేవ్ లైఫ్ అంటూ నినాదాలు చేశారు. పొగాకు ఉత్పత్తుల జోలికి పోమని గ్రామస్తులతో ప్రమాణం చేయించారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యధిక మరణాలకు పొగాకే కారణమని, క్యాన్సర్, గుండెజబ్బులు, శ్వాసకోశ వ్యాధులతో ఏటా 70 లక్షల మంది మరణిస్తున్నారని అన్నారు. పొగాకు వినియోగం వల్ల వచ్చే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు 1988 నుంచి మే 31న అంతర్జాతీయ పొగాకు వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది నరసింహారావు, పద్మావతి, ఈశ్వరరావు, సత్యారావు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ధూమపాన వ్యతిరేక దినాన్ని శుక్రవారం నిర్వహించారు. పొగతాగడం వల్ల కలిగే అనర్థాలను వైద్యాధికారి జగదీష్ ప్రజలకు వివరించారు. పొగతాగడం వల్ల గుండె, ఊపిరితిత్తులు, ఇతర అవయవాలు పాడైపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు. దీని వల్ల క్యాన్సర్ బారిన పడకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాంతీయ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా సర్వే


చిన్నారి వివరాలు సేకరిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్, ఐఈఆర్టీ సత్యనారాయణ

మెరకముడిదాం: మండలంలో ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపు సర్వే చురుగ్గా జరుగుతోంది. భవిత కేంద్రానికి చెందిన ఐఈఆర్‌టీలు ఎం.సత్యనారాయణ, పి.రవికుమార్‌లు శుక్రవారం కొర్లాం, కొత్తకర్ర, ఎం.రావివలస, తదితర గ్రామాల్లో సర్వే చేపట్టారు. వినికిడి, దృష్టిలోపం ఉన్న చిన్నారులతో పాటు దివ్యాంగ పిల్లలను గుర్తించి వారి వివరాలు నమోదు చేస్తున్నారు. భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం వారికి ఉచితంగా అందించే సేవలు, పథకాలను చిన్నారుల తల్లిదండ్రులకు వివరిస్తున్నారు. చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించాలని కోరుతున్నారు. సర్వేను ఎంఈఓ–1 చంద్రశేఖర్ పర్యవేక్షించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

బొండపల్లి: మండలంలోని వివిధ రకాలైన పింఛనుదారులు 8062 మంది ఉండగా వారందరికీ జూలై నెలకు సంబంధించిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంపీడీఓ ఎస్.హరిహరరావు తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఉన్న పింఛనుదారులు 6027 మందికి నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందన్నారు. బ్యాంకు ఖాతాలు లేని పింఛన్‌లబ్ధిదారులు 2035 మంది ఉండగా వారందరికీ సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు నేరుగా ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందచేయనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీ ప్రారంభమవుతుందన్నారు.

దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే పింఛన్

దత్తిరాజేరు: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఈనెల కూడా పింఛన్లను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమారి తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులుకు సచివాలయ సిబ్బందితో ఇంటి వద్దే పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

జాబ్‌కార్డు ఉంటేనే ఉపాధి పని


దత్తిరాజేరు: గడబవలసలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రకుమారి


బొండపల్లి: రాజేరులో వేతనదారుల మస్తర్లు తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: జాబ్‌కార్డు కలిగి ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాల్సిన బాధ్యత క్షేత్ర సహాయకులపై ఉందని ఎంపీడీఓ ఎస్.హరిహరరావు అన్నారు. మండలంలోని బి.రాజేరు గ్రామంలోని మంగళవాని చెరువులో చేపడుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. సాంకేతిక సహాయకులు ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే గిట్టుబాటు వేతనం పొందవచ్చని వేతనదారులకు సూచించారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున 11 గంటల లోపు పనులు ముగించాలని అన్నారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీరు, నీడ ఏర్పాట్లును చేయాలని సిబ్బందికి సూచించారు.

- దత్తిరాజేరు: మండలంలోని గడబవలస చెరువులో చేపడుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడీఓ చంద్రకుమారి శుక్రవారం పరిశీలించారు. వేతనదారుల మస్తర్లు తనిఖీ చేశారు. ఇచ్చిన కొలతల ప్రకారం పని చేస్తే గరిష్ట వేతనం పొందవచ్చని సూచించారు. పని ప్రదేశంలో తాగునీరు, టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉండేలా చూడాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

భానుడి భగభగ

- ఉక్కపోతతో జనం విలవిల
- కర్ఫ్యూను తలపిస్తున్న ప్రధాన రహదారులు


గజపతినగరం రూరల్: నిర్మానుష్యంగా మరుపల్లి గ్రామ రోడ్డు


గజపతినగరం: కర్ఫ్యూను తలపిస్తున్న గజపతినగరం-విజయనగరం జాతీయ రహదారి


వేపాడ: మధ్యాహ్నం 12 గంటల సమయంలో నిర్మానుష్యంగా మారిన వేపాడ-ఆనందపురం ప్రధాన రహదారి


గజపతినగరం: ఖాళీగా కనిపిస్తున్న గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రి రోడ్డు


గజపతినగరం/గజపతినగరం రూరల్/వేపాడ: భానుడి భగభగలకు జనాలు విలవిలలాడిపోతున్నారు. గత వారం రోజులుగా నియోజకవర్గంలో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా నమోదు అవుతుండడంతో వృద్ధులు, చిన్నారులు, రోగులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9 గంటల నుంచే సూరీడు తన ప్రతాపం చూపిస్తుండడంతో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. పశువులు, పక్షులు చెట్ల నీడకు చేరుకుని సేదతీరుతున్నాయి. ఉపాధి పనులు చేసే ప్రదేశాల్లో అధికారులు తాగునీరు, నీడ సౌకర్యం కల్పించారు. వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. మరికొద్ది రోజులు ఎండలు ఉండే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

ఐడియా అదుర్స్..


ఎండ, వాన నుంచి రక్షణగా ద్విచక్ర వాహనంపై ఏర్పాటు చేసిన ఛత్రం

వేపాడ: ఎండలు, వర్షాల నుంచి రక్షణగా ఓ ద్విచక్ర వాహనచోదకుడు తన వాహనానికి అమర్చిన ఛత్రం పలువురిని ఆకట్టుకుంటోంది. డ్రైవింగ్ చేసే వ్యక్తితో పాటు వెనుక సీటులో కూర్చున్న వ్యక్తికి కూడా ఎండ, వాన నుంచి రక్షణ కల్పించేలా ఛత్రం(గొడుగు)ను అమర్చాడు. శుక్రవారం ఈ వాహనంపై రయ్ రయ్‌మని షికారు చేస్తూ కనిపించాడు. తాను బెంగుళూరులో ఇలాంటిది చూశానని, అక్కడ నుంచి తెచ్చుకుని తన వాహనానికి అమర్చినట్లు ఆ వ్యక్తి తెలిపాడు. వాహనానికి ఈ గొడుగు అమర్చడానికి వెయ్యి రూపాయలు మాత్రమే ఖర్చయినట్లు చెప్పాడు. దీన్ని చూసిన వారంతా ఐడియా అదుర్స్ అంటున్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి


మృతిచెందిన సూర్యనారాయణ

వేపాడ: మండలంలోని బొద్దాం సమీపంలో వడదెబ్బకు గురై వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి వల్లంపూడి ఎస్సై రాజేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. లక్కవరపుకోట మండలం గొల్జాం గ్రామానికి చెందిన తూర్పాటి సూర్యనారాయణ(36) శుక్రవారం మేస్త్రీ పనికి బొద్దాం వెళ్తుండగా వడదెబ్బకు గురై కళ్లు తిరిగి పడిపోయాడు. ఆ సమయంలో సాయం చేసేందుకు అక్కడ ఎవరూ లేకపోవడంతో మృతి చెంది ఉంటాడని స్థానికులు అంటున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై రాజేష్ అక్కడు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య ఉమామహేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణం చెడగొట్టొద్దు


గుర్ల: కెల్లలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై భాస్కరరావు


మెరకముడిదాం: సోమలింగాపురం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై లోకేశ్వరరావు

గుర్ల: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ప్రశాంత వాతావరణం ఉండాలని ఎస్సై భాస్కరరావు సూచించారు. మండలంలోని కెల్ల గ్రామంలో శుక్రవారం గ్రామ పెద్దలు, యువతతో సమావేశమై మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. కౌంటింగ్ జరుగుతున్న సమయంలో గ్రామాల్లో ఎలాంటి ఘర్షణలు జరగకుండా చూడాల్సిన బాధ్యత గ్రామ పెద్దలపై ఉందన్నారు. గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బాణసంచా కాల్చడం, ర్యాలీల నిర్వహణకు ఎలాంటి అనుమతులు లేవవన్నారు. గ్రామాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, కాబట్టి ప్రజలు గుమిగూడి ఉండొద్దని సూచించారు.

- మెరకముడిదాం: ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని బుధరాయవలస ఎస్సై బి.లోకేశ్వరరావు అన్నారు. మండలంలోని సాతాంవలస, సోమలింగాపురం గ్రామాల్లో శుక్రవారం పర్యటించారు. ఎన్నికల కోడ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. పార్టీల గెలుపోటములపై బెట్టింగులకు పాల్పడినా, ఇతరులను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసినా, గొడవలు సృష్టించేందుకు ప్రయత్నించినా, ఊరేగింపులు, ర్యాలీలు, బాణసంచా కాల్చినా కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

అన్నదాన కార్యక్రమం

జామి: మండల కేంద్రమైన జామిలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కుసుమంచి ఎల్లాజీ, శ్రీనివాసరావు జ్ఞాపకార్థం యిండుపూరి సుబ్బరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతీ శుక్రవారం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందిస్తున్న వారికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విన్నకోట కామేశ్వరరావు, జామి వాసవీక్లబ్ యూత్ కార్యదర్శి వి.సంతోష్‌కుమార్, నరసరాజు, గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

సామంతులకు అస్వస్థత

గజపతినగరం/గజపతినగరం రూరల్: వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు, లోగిశ గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు సామంతులు పైడిరాజు అస్వస్థతకు గురయ్యారు. గురువారం ఉదయం ఆరుబయటకు వెళ్లిన ఆయన ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. గమనించిన గ్రామస్తులు ఆయన్ను గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అతనిక ఎడమ కాలిపై రెండు గాట్లు ఉన్నట్లు అక్కడి వైద్యులు గుర్తించారు. ప్రస్తుతం పైడిరాజు పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.